# తల్లిపాల వారోత్సవాలు 2010 (1-7 ఆగష్టు)

## తల్లిపాలప్రోత్సాహం

## కేవలం 10 సూచనలతో! ... శిశు మైత్రీ బాటలో!!



### (తల్లిపాలిచ్చే తల్లులకు సహకరించడానికి ఇదొక పిలుపు)





ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా ఆగష్టు నెలమొదటి వారంరోజులు "తల్లిపాలవారోత్సవాలుగా" గడచిన 18 సంవత్సరాలుగా 'వాబా' **(WABA)** సంస్థ ఆధ్వర్యంలో **WHO, Unicef** ల సహకారంతో జరుపబడుచున్నది. మనదేశంలో **BPNI** సంస్థ కీలక పాత్ర వహిస్తున్నది.

అమూల్యమైన తల్లిపాలసంస్కృతి పునరుద్దరణకు తల్లులను ప్రోత్సహించి, వారికి సహకరించి తద్వారా తల్లీ పిల్లలను రక్షించుకోవడానికి ప్రతి సంవత్సరం ఒక క్రొత్త సందేశంతో ఈ వారోత్సవాలు జరుగుచున్నాయి. ఇది 19వ వారోత్సవం.

**పుట్టినప్పటి నుంచి మొదటి 6నెలలవయస్సు వరకు తల్లిపాలు బిడ్డకు సంపూర్ణ ఆహారం.**

బిడ్డకు కావలసిన అన్ని పోషక పదార్థాలు మరియు వ్యాధి నిరోధక శక్తి తల్లిపాలద్వారా లభిస్తుంది. చక్కటి పోషణ, బుద్ధి కుశలత, ప్రాణాంతకమైన జబ్బులనుంచి రక్షణ, వెలకట్టలేని తల్లీ పిల్లలఅనుబంధం, వివిధ దీర్ఘకాలిక జబ్బులనుండి రక్షణ పిల్లలకు లభ్యమవుతుంది. రొమ్ము క్యాన్సరు, అండాశయపు క్యాన్సరు, రక్తహీనత, ఎముకలబలహీనతలనుండి రక్షణ, సహజ గర్భనిరోధక శక్తి, ఊబకాయ నివారణ మొదలగునవి తల్లికి లభించే ఉపయోగాలు. కుటుంబ ఆర్థిక పరిస్థితికి, ఆరోగ్యవంతమైన సమాజానికి, పర్యావరణ పరిరక్షణకు కూడా తల్లిపాలు దోహదం చేస్తుందన్న విషయం మనందరికీ తెలిసినదే.





BPNI IBFAN

BPNI 2010

**Join the One Million Campaign: Support Women to Breastfeed**

**http://www.onemillioncampaign.org**

పిల్లలు ఆరోగ్యంగా ఎదగడానికి **WHO/UNICEF** సిఫారసు మేరకు భారత ప్రభుత్వము నిర్దేశించిన జాతీయ మార్గదర్శకాలు 2004 & 2006 (NATIONAL GUIDELINES ON IYCF).

- పుట్టిన గంటలోపే తల్లిపాలు ఇప్పించాలి.
- మొదటి 6 నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టాలి.
- అటు పిమ్మట అనువైన సురక్షితమైన అదనపు (ఇంటిలో వండిన) ఆహారం అందిస్తూ
- తల్లిపాలు 2 సం॥ల వయస్సు వరకు కొనసాగించాలి.



ప్రతి సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా సూమారు 8 మిలియన్‌ల 5 సం॥లలోపు పిల్లలు వివిధ కారణాలతో మరణిస్తున్నారు (ఇందులో మన దేశంలో 2 మిలియన్‌లు). 70 శాతం మరణాలు మొదటి సంవత్సరం లోపే జరుగుతున్నాయి. సుమారు 50 శాతం వరకు ఈ మరణాలు పౌష్టిక ఆహార లోపం (Undernutrition) వల్ల జరుగుచున్నది. పుట్టినప్పటి నుంచి పిల్లలకు అందించవలసిన ఆహారం మరియు అందించే పద్ధతులపైన అవగాహన లేకపోవడమే ఈ కుపోషణకు (Malnutrition) ముఖ్య కారణం.

5 సం॥లలోపు మరణాలలో సుమారు 40 శాతం, నెలలోపు శిశువులలో జరుగుచున్నది (సుమారు 4 మిలియన్‌లు). పుట్టిన గంటలోపే శిశువులకు తల్లిపాలు ఇప్పించినట్లైతే 22 శాతం శిశు మరణాలు (ప్రపంచ వ్యాప్తంగా ఒక మిలియన్- మనదేశంలో 2.5 లక్షలు) నివారించవచ్చని 2006వ సం॥ 'ఘన' దేశంలో జరిగిన పరిశోధనలో నిరూపించ బడినది. అదే విధంగా మొదటి 6 నెలలు కేవలం తల్లిపాలు మాత్రమే ఇప్పించినట్లయితే సుమారు 15 శాతం 5 సం॥లలోపు మరణాలు, 6 నెలల మీదట అనువైన అదనపు ఆహారం అందిస్తూ తల్లిపాలు 2 సం॥ల వరకు కొనసాగించినట్లయితే మరో 6 శాతం మరణాలు నివారించవచ్చని మరియు కుపోషణను ఘననీయంగా తగ్గించవచ్చని పలు మార్లు శాస్త్రీయ పరిశోధనలలో (Lancet-2003, 04, 05, 06) రుజువైనది.

**2009వ సం॥ తల్లిపాల వారోత్సవాలలో "అత్యవసర/విపత్కర పరిస్థితుల్లో తల్లిపాల ప్రోత్సాహం" గురించి చర్చించబడినది.**

**ఈ సం॥ (2010) "10 సూచనలతో, శిశుమైత్రి బాటలో- విజయవంతంగా తల్లిపాల ప్రోత్సాహము" అన్నది సందేశంగా తీసుకోవడం జరిగినది.**

## ఏమిటి ఈ 10 సూచనల తల్లిపాల ప్రోత్సాహం?

# పది సూచనల తల్లిపాల ప్రోత్సాహక శిశుమైత్రీ ఆసుపత్రుల ప్రణాళిక.

**ప్రసూతి మరియు నవజాత శిశువు (Newborn) లకు చికిత్సనందించే ఆసుపత్రులలో**

- లిఖిత పూర్వక తల్లిపాల ప్రోత్సాహక ప్రణాళిక ప్రదర్శింపబడి ఉండాలి, ఈ ప్రణాళికలోని అంశాలపై ఆసుపత్రిలో పనిచేసే సిబ్బంది అందరికీ అవగాహన ఉండాలి.
- ఈ ప్రణాళిక ఆచరణకు సిబ్బంది అందరూ తగిన శిక్షణ పొందియుండాలి.
- ఆసుపత్రికి వచ్చే గర్భిణీ స్త్రీలందరికీ తల్లిపాల ప్రాముఖ్యత మరియు తల్లిపాలకు సంబంధించిన అన్ని విషయాలు క్షుణ్ణంగా వివరించబడాలి. (ప్రసవించే సమయానికి బిడ్డకు పాలివ్వడానికి తల్లి సిద్ధంగా ఉండేటట్లు).
- ఆరోగ్యంగా పుట్టిన నవజాతశిశువులకు ప్రసవించిన అర్ధగంటలోనే తల్లిపాలు ఇప్పించడానికి తల్లులకు సహకారం అందించాలి.
- బిడ్డకు తల్లిపాలు అందించే సరియైన పద్ధతి (రొమ్ము సమస్యలు నివారించడానికి) మరియు అనారోగ్య కారణాలతో బిడ్డ తల్లిరొమ్ము చీకలేని పరిస్థితిలో, తన చేతితో రొమ్ము పితికి పాలను తరచుగా తీసివేస్తూ (అవసరమైతే ఆ పాలను కప్పుద్వారా బిడ్డకు త్రాగించడం) తల్లిపాల ఉత్పత్తి కొనసాగించడానికి తల్లులకు సహకారం అందించాలి.
- నవజాత శిశువులకు తల్లిపాలు మినహా ఏ ఇతర ఆహారము/ పానీయము ఇప్పించరాదు. (వైద్యరీత్యా అవసరమైతే తప్ప). మొదటి రోజులలో తక్కువ మోతాదులో లభ్యమయ్యే ముర్రుపాలే బిడ్డకు సరిపోతాయన్న విషయము తల్లికి చెప్పాలి.
- 24 గంటలూ తల్లీ బిడ్డలిద్దరూ కలిసే ఉండాలి. దీనివలన తల్లీ బిడ్డల మధ్య అనుబంధం మరియు బిడ్డకు తల్లిపాలు చక్కగా అందించడం జరుగుతుంది.
- నిర్ణీత గడువుతో కాకుండా బిడ్డకు అవసరమైనప్పుడల్లా (ఆకలి సంజ్ఞలు గుర్తించి) తల్లిపాలు ఇప్పించబడాలి.
- తల్లిపాలు త్రాగుచున్న శిశువులకు రబ్బర్ నిప్పల్, పాలపీకలు మొదలగునవి అలవాటు చేయరాదు.
- పిల్లలకు చక్కగా తల్లిపాలు ఇస్తున్న వారు/ తల్లిపాల ప్రాముఖ్యత మరియు ప్రోత్సాహనికి సంబంధించిన విషయాలపై శిక్షణ/అవగాహన పొందినవారిని కలిపి ఒక సంఘంగా ఏర్పరచి (తల్లిపాల ప్రోత్సాహక సంఘాలు) ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన పిమ్మట అవసరమైతే ఆ సంఘాల సహకారాన్ని తీసుకోమని తల్లులకు సూచించాలి.

**తల్లులకు సహకరించడానికి ఇదొక సువర్ణ మార్గం**

# మనదేశంలో తల్లిపాల సంస్కృతి ఎలా ఉన్నది?

తల్లిపాలు మరియు పిల్లలకు అదనపు ఆహారం అందించే విషయాల ప్రోత్సాహానికి ఉన్నటువంటి ప్రణాళికలు మరియు పథకాల (Poliocy & Programme)పై P.H.R.N. /BPNI./ IBFAN సంస్థలు 32 దేశాలలో (2008లో) నిర్వహించిన సమగ్ర పరిశీలనలో మనదేశం 27వ స్థానంలో ఉన్నట్లు తెలిసినది.


భారత ప్రభుత్వము 2005-06లో నిర్వహించిన (NFHS-3) సర్వే ప్రకారం కూడా అంత ఆశాజనకంగా లేదు.

1. మొదటి గంటలో తల్లిపాలు కేవలం 24.5% తల్లులు మాత్రమే అందిస్తునారు. 2007-08 సంIIలో 534 జిల్లాలలో నిర్వహించిన జిల్లా స్థాయి ఆరోగ్య సర్వేలో (DLHS), 40% పిల్లలు మొదటి గంటలో తల్లిపాలు త్రాగుచున్నట్లు తెలిసినది. (138 జిల్లాలో 0-29%, 197 జిల్లాలో 30-49%, 194 జిల్లాలో 50-89%, 5 జిల్లాలలో 90%పైబడి ఉన్నది.)
2. మొదటి 6 నెలలు కేవలం తల్లిపాలు 46.3% ఇస్తున్నారు. DLHS ప్రకారం 112 జిల్లాలలో 0-11%, 373 జిల్లాలో 12-49%, 49 జిల్లాలలో 50-89% ఉన్నది. ఒక్క జిల్లాలో కూడా 90-100% లేదు. ఇదికూడా క్షుణ్ణంగా పరిశీలించి నట్లయితే మొదటి 6 నెలలు తల్లిపాలు మాత్రమే ఇచ్చేవారి శాతం, 6 నెలలలోపల, నెల నెలకీ క్రమేణా తగ్గుతూ వస్తున్నది. కేవలం 20% పిల్లలు మాత్రమే మొదటి 6 నెలల పూర్తికాలం తల్లిపాలు తీసుకుంటున్నారు.



3. తల్లిపాలు కొనసాగిస్తూ 6-9 నెలల వయస్సులోఅదనపు ఆహారం ప్రారంభించు వారు 55.8%. ఇది NFHS-2, (35%) కన్నా కొంత మెరుగు అని చెప్పవచ్చు. కానీ DLHS సర్వే ప్రకారం. కేవలం 23.9% మాత్రమే అదనపు ఆహారం ప్రారంభిస్తున్నారు.

మొదటి గంటలో తల్లిపాలు ప్రారంభించడం మినహా మిగతా రెండు అంశాలలో గత 2 దశాబ్దాలుగా ఆశించిన




**చిత్రం 1 : తల్లిపాలకు సంబంధించిన 3 అంశాలు.**

స్థాయిలో పురోగతిలేదని చెప్పవచ్చు. పాలపౌడరు/శిశు ఆహారం తయారు చేసే పరిశ్రమలవారి విపరీత ప్రోత్సాహక పద్ధతులు, తల్లులకు (ఆసుపత్రులు, కుటుంబము, యాజమాన్యము నుంచి) సహకారం అందక పోవడం ముఖ్య కారణాలుగా చెప్పుకోవచ్చు. **(సంబంధిత పరిశ్రమలవారి వ్యాపార పద్ధతులను క్రమబద్ధీకరించే తల్లిపాల ప్రత్యమ్నాయ చట్టం (IMS**


**Act 1992 ammended in 2003) అమలులో ఉన్నది.)** తల్లిపాలు – అదనపు ఆహారం పై ఉన్న జాతీయ మార్గదర్శకాలను పటిష్టంగా అమలు పరచడానికి బడ్జెట్‌తో కూడిన ప్రణాళికా పద్ధతులు మరియు అమలుపరచడానికి సంబంధిత శాఖల సమన్వయంతో కూడిన సహకారం ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. (India Assessment 2008).

## తల్లిపాల సంస్కృతిని పెంపొందించవలసిన అవసరం.

అనాదిగా తల్లిపాల సంస్కృతి సాంప్రదాయంగా ఉన్న మన దేశంలో తల్లిపాల ప్రోత్సాహం అవసరమా అన్నది ప్రతిఒక్కరిలో కలిగే సందేహం. వాస్తవాలు గమనించినట్లయితే మనదేశంలో ప్రతి సంవత్సరం సుమారు 1.4 మిలియన్ల పిల్లలు ఒక సంవత్సరం వయస్సులోపే మరణిస్తున్నారు. ఇందులో 1 మిలియన్ మరణాలు పుట్టిన మొదటి నెలలోనే సంభవిస్తున్నాయి. పుట్టిన మొదటి గంటలో తల్లిపాలు ఇప్పించినట్లయితే 22% నెలలోపు మరణాలు నివారించవచ్చు. మొదటి 6 నెలలు తల్లిపాలు మాత్రమే ఇచ్చినట్లయితే ప్రాణాంతకమైన – నీళ్ళ విరేచనాలు, శ్వాసకోస వ్యాధులు, నవజాత శిశువులు గురియయ్యే అంటు వ్యాధుల నుండి పిల్లలు రక్షింప బడతారు. తల్లిపాల ఆవశ్యకత గురించి తల్లులకు కౌన్సిలింగ్ ప్రక్రియద్వారా అవగాన కల్పించి, సహకరించినట్లయితే తల్లిపాల సంస్కృతిని చక్కగా పెంపొందించవచ్చని శాస్త్రీయంగా విశదమవుతోంది.

NFHS-3 ప్రకారం మనదేశంలో ప్రతి సంవత్సరం 26-27 మిలియన్ పిల్లలు పుడుతున్నారు. ఇందులో 22% తక్కువ బరువుతో పుడుతున్నారు. పుట్టినప్పటి నుంచి పిల్లలకు అందించవలసిన ఆహారంపై శ్రద్ధ వహించడం చాలా అవసరం. ఎందుకంటే కుపోషణ (Malnutrition) మొదటి నెలల్లోనే ప్రారంభమై 18 నెలల వయస్సు వచ్చేసరికి తీవ్ర స్థాయికి చేరుకుంటున్నది. దీనివలన సుమారు 60 మిలియన్ల 5 సం॥లలోపు పిల్లలు పౌష్టిక ఆహారలోపానికి (Under nutrition) గురియై తక్కువ బరువుతో ఉంటున్నారు.

పిల్లల మానసిక వికాసానికి తల్లిపాలుతోడ్పడుతాయి. 70% మెదడు ఎదుగుదల మొదటి సంవత్సరంలో జరుగుతుంది. 2 సం॥లు అయ్యే సరికి 90% మెదడు ఎదుగుదల పూర్తి అవుతుంది. మెదడు పెరుగుదలకు తల్లిపాలు చాలా అవసరం. కావున బిడ్డ జీవితంలో మొదటి 2 సంవత్సరాలు చాలా కీలకం అని చెప్పవచ్చు. అంతేకాకుండా




చిత్రం 2 : మొదటి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వకుంటే కలిగే ప్రమాదాల సూచిక.

తల్లిపాలవలన ఊబకాయం, పెద్దయ్యాక వచ్చే అధిక రక్తపు పోటు, గుండె జబ్బులు వంటి దీర్ఘకాలిక జబ్బుల నుంచి కూడా పిల్లలకు రక్షణ కల్గుతుందన్నది తెలిసిన విషయమే.

**కేవలం ఆసుపత్రులలో మాత్రమే ఈ 10 సూచనల తల్లిపాల ప్రోత్సాహం అందిస్తే సరిపోదు.**


ఆసుపత్రులలో తల్లిపాలు ప్రోత్సహించడానికి WHO/UNICEF వారి 10 సూచనలతో కూడిన శిశు మైత్రి అసుపత్రుల పథకాన్ని మనదేశంలో 1993వ సం॥ ప్రవేశపెట్టడం జరిగినది. దీని వలన ఆసుపత్రులలో కొంత ప్రగతి సాధించినప్పటికీ, సమాజంలో తల్లిపాల సంస్కృతి పెంపొందించడానికి మరిన్ని సూచనలు అవసరమని గుర్తించడం జరిగినది.

10 సూత్రాల తల్లిపాల ప్రోత్సాహక శిశు మైత్రి ఆసుపత్రుల పథకం (Baby Friendly Hospital Initiative-BFHI) 1993లో ప్రారంభించిన తరువాత, 1994-98 మధ్య కాలంలో దేశ వ్యాప్తంగా సుమారు 1372 ఆసుపత్రుల్లో ఈ పథకం అమలు కాబడినది. 13 రాష్ట్రాలలోని 600 ఆసుపత్రుల యందు నిర్వహించిన BFHI సర్వే ప్రకారం కొంత ప్రగతి కన్పించింది.

మొదటి గంటలో తల్లిపాలు ఇవ్వడం BFHI ఆసుపత్రులలో 54.5%గాను, ఇతర ఆసుపత్రులలో 36.5 శాతంగాను ఉన్నది. తల్లిపాలకన్నా ముందు వేరే ఇతర ఆహారము / పానీయం (Prelacteal Feeds) ఇచ్చేవారి సంఖ్య BFHI ఆసుపత్రులలో 34% నుండి 16%కు తగ్గినది. తల్లిపాలతో పాటు ఇతర ఆహారం (Supplementary Feeds) అందించేవారి సంఖ్య 17% నుండి 7%కు తగ్గినది.

కానీ మొదటి 6 నెలలు పూర్తి కాలం తల్లిపాలు మాత్రమే అందించే వారి సంఖ్యలో మాత్రం ఆశించిన మేర ప్రగతి లేదు. వాస్తవానికి మనదేశంలో ప్రస్తుతం ఈ పథకం ఆసుపత్రులలో అంతగా ఆచరణలో లేదనే చెప్పాలి. కావున ఈ పథకం అమలుపై దృష్టి సారించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

50% కన్నా ఎక్కువ ప్రసవాలు ఇళ్ళలోనే జరుగుచున్నాయి. కావున ఈ 10 సూత్రాల



తల్లిపాల ప్రోత్సాహం ఆసుపత్రులతోపాటు ఇంటిదగ్గర కూడా కొనసాగాలి. దీనికి కుటుంబ సభ్యులు, సమాజము, ఉద్యోగినులైతే యాజమాన్యం (ప్రభుత్వ మరియు ప్రైవేటు సంస్థలు) నుంచి సహకారం ఉండాలి.

ఆసుపత్రులలో లాగానే సమాజంలో కూడా ఈ శిశు మైత్రీ బాటలో తల్లులకు ప్రోత్సాహక సహకారాలు అందించినట్లయితే మొదటి గంటలో తల్లిపాలు త్రాగించడం, మొదటి 6 నెలలు కేవలం తల్లిపాలు ఇవ్వడం, అటు పిమ్మట తల్లిపాలు కొనసాగిస్తూ అదనపు ఆహారం ప్రారంభించడం చక్కగా అమలవుతాయి. దీనికి ఆసుపత్రులు మరియు సమాజానికి మధ్య సమన్వయం అవసరం.


## క్షేత్ర స్థాయిలో ఇది సాధ్యమా?

2008-09 సంవత్సరంలో ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం, లలిత్‌పూర్ జిల్లాలో - బి.ఆర్.డి. వైద్య కళాశాల (గోరక్‌పూర్) చిన్నపిల్లల విభాగంవారు, యూనిసెఫ్ మరియు స్థానిక ప్రభుత్వ యంత్రాంగంతో కలసి పుట్టినప్పటి నుంచి పిల్లలకు అందించవలసిన ఆహారము మరియు అందించే పద్ధతులపై సమాజంలో చైతన్యం తీసుకువచ్చి తల్లులకు సహకరించే ప్రయత్నం చేశారు.

జిల్లాలోని 6 బ్లాకులలో 50 మందిని గుర్తించి వారికి శిక్షణ ఇప్పించి శిక్షకులు/ కౌన్సిలర్స్‌గా తయారు చేశారు. వీరి ద్వారా సుమారు 2200 మంది గ్రామ స్థాయి కార్యకర్తలకు (Asha, AWW, TBA, Village Women) శిక్షణ ఇప్పించి జిల్లావ్యాప్తంగా వీరితో తల్లులకు, కుటుంబ సభ్యులకు సహకారం అందించడం జరిగినది. మంచి ఫలితాలు కనబడ్డాయి. మొదటి గంటలో తల్లిపాలు ఇచ్చేవారి సంఖ్య 39 నుంచి 57.9%కు పెరిగినది. 6 నెలలు కేవలం తల్లిపాలు ఇచ్చేవారి సంఖ్య 6.8 నుంచి 24.9% నకు పెరిగినది. 6 నెలల మీదట తల్లిపాలు ఇస్తూ అదనపు ఆహారం ప్రారంభించేవారి సంఖ్య 4.6 నుంచి



35.8%నకు పెరిగినది. మొదటి నెలలో సంభవించే నవజాత శిశు మరణాలు 25-30% తగ్గినవి.




**చిత్రం 3 : లలిత్ పూర్ జిల్లాలో గమనించిన అంశాలు.**

మరో ప్రాంతంలో కూడా ఇదే పద్ధతిని అవలంభించుటద్వారా మొదటి గంటలో తల్లిపాలు త్రాగించేవారి సంఖ్య 24% నుంచి 50% వరకు, 3 నెలల బాలింతలను పరిశీలించినప్పుడు తల్లిపాలుమాత్రమే ఇచ్చేవారి సంఖ్య 48% నుంచి 79% వరకు పెరిగినవని కనుగొన్నారు.

లలితపూర్ పద్ధతిలో దేశవ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో తల్లులకు సహకారం అందించి నట్లయితే ఘననీయమైన ప్రగతిని సాధించవచ్చు.

## మనం ఏమి చేయాలి?

10 సూత్రాల తల్లిపాల ప్రోత్సాహక ప్రణాళిక

1. ప్రతి ఆసుపత్రిలోను మరియు ప్రతి పురిటి ఇంటిలోను ఆచరణకు కృషిచేయాలి.
2. మీడియా సహకారముతో సమాజంలో చైతన్యం తీసుకురావాలి.
3. సంబంధిత ప్రభుత్వ శాఖలలో అవగాన కల్పించి, వాటి మధ్య ఈ ప్రణాళిక అమలుకు సమన్వయం తీసుకురావాలి.
4. రాజకీయ నాయకులకు వివరించి, వారిద్వారా ప్రభుత్వ సహకారానికి కృషిచేయాలి.
5. పాలపొడరు, శిశు ఆహారము, పాలసీసాల పరిశ్రమలవారి వ్యాపార పద్ధతులను సమీక్షిస్తూ **IMS Act** సక్రమంగా అమలు కావడానికి కృషి చేయాలి.
6. కుటుంబ సభ్యులను చైతన్యపరచి మొదటి గంటలో తల్లిపాలు ఇవ్వడం, 6 నెలలవరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇప్పించడం, అటుపిమ్మట అదనపు ఆహారం ప్రారంభించి తల్లిపాలు కొనసాగించడం మొదలగు విషయాలపై అవగాహన తీసుకురావాలి.
7. ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల యాజమాన్యంతో చర్చించి ఉద్యోగం చేయుచున్న తల్లులకు సహకారం అందేటట్లు చూడాలి.



Breastfeeding Promotion Network of India (BPNI)
Regional Coordinating Office for IBFAN Asia,
Regional Focal Point forWABA
Address: BP-33, Pitampura,Delhi 110 034. Tel: +91-11-27343608, 42683059.
Tel/Fax: Email: Website:+91-11-27343606. bpni@bpni.org. www.bpni.org

BPNI's WBW Action Folder : 2010 Telugu Version

Prepared by :
Dr. K. Kesavulu, CCC Member-BPNI
Civil Surgeon Paediatrician,
Govt. Dist. Hospital, Hindupur - 515 201 A.P.
Email : doctorkesavulu@rediffmail.com

Resource : BPNI WBW Action Folder : 2010

Telugu Version Designed By : S. Sudarsana Babu, Balaji Offset Printers, Hindupur.